# నటీమణి శాంత

★

శ్రీ మల్లాది అవధాని బి. ఏ.



25 వ తేదీ డిశంబరు రాత్రి మెయిల్‌లో మద్రాసు వెళ్లుతున్నాను. ట్రెయిను నడిరాత్రికి ఏలూరు స్టేషనులో ఆగింది. బయట దట్టంగావున్న చీకటిలో ప్లాటుఫారం మీది దీపాలు మాత్రం నక్షత్రాలవలె మినుకు మినుకు మంటున్నవి. చలి తీవ్రంగాఉన్నది. నేను శాలువ కప్పుకొంటూ "బంగశ్రీ" తెరిచినాను. ఇంతలో బయటనుంచి ఎవరో "అవధానిగారూ," అంటూ పిలచినారు. కిటికీలోనుంచి చూచినాను. ప్లాటుఫారం మీద క్రొత్తపల్లి లక్ష్మయ్యగారు నిలబడి నన్ను పిలుస్తున్నారు.

లక్ష్మయ్యగారు నాట్యకళా ప్రేమికుడు. తన సర్వస్వాన్నీ కళకోసమని కరిగించి పోస్తున్న కళోపాసకుడు. స్వయముగా నటుడు. గోవిందరాయ నాట్యమండలికి కార్యదర్శి.

"ఏలూరులో మేము నాటకాలు వేస్తున్నాము. మీరు దిగి రెండుమూడు నాటకాలు చూడవలె" నని ఆయన నన్ను ట్రెయినులో నుండి దింపివేసినాడు

రాత్రి లక్ష్మయ్యగారికి అతిథి నైనాను. అతడు నాట్య కళాపరిషత్తును గురించి, నాట్య కళ పత్రికను గురించీ ప్రస్తుత నాట్యరంగ పరిస్థితులనుగురించీ నటులను గురించీ తన అభిప్రాయాలు చెప్పిచెప్పి తుదకు "రేపటిరాత్రి మీరొక నటీమణిని చూడగలరు" అని నిశ్శబ్దత వహించినాడు.

నే ననేకమంది నటులను చూచినాను. అంతకు రెండితలమంది నటీమణులను చూచినాను. కాని యింతదనుక యీ తెనుగునాట్య రంగముపై స్త్రీపాత్రను సమర్థంగా అభినయించిన నటినిగాని నటునిగాని చూడలేదు.

౨

మర్నాటిరాత్రి గోవిందరాయ నాట్య మండలి వారు తమ స్వంత నాట్యశాలలో 'కృష్ణలీల' నాటకాన్ని ప్రదర్శిస్తున్నారు. నన్ను లక్ష్మయ్యగారు ఆ నాటకానికి ఆహ్వానించినారు.

'కృష్ణలీల' కథ మన దేశములో ఎంత ప్రఖ్యాతమో నాటకముకూడా అంతే. ఇదివరలో యీ నాటకాన్నే ఎందరెందరో ప్రదర్శించగా చూచిన నేను తిరిగి గోవిందరాయ నాట్యమండలివా రనభినయించడము చూడడము తటస్థించినది.

ప్రథమాంకములో ద్వితీయ దృశ్యములో రంగస్థలముపైకి దేవకి వచ్చింది. ఇంతవరకు సంకుల శబ్దాలు చేస్తున్న సామాజికులు అందరూ ఒక్కసారిగా నిశ్శబ్దత వహించినారు. ఏలూరు సామాజికుల తత్వాన్ని తెలిసిన నాకీ విషయం మొదట చాలా వింతగా కనపడ్డది. దేవకి పాత్రధారణ బాగున్నది- అంతకంటె ఆదృశ్యములో నాకేమీ విశేషము కన్పించలేదు.

తరువాతదృశ్యాలలో దేవకి పలికిన ప్రతి పలుకూ నా హృదయాన్ని కదిలించడం మొదలు పెట్టింది. ఆ చలనశక్తి గ్రంధకర్త వ్రాసిన రచనది కాదు. దేవకీ కంఠస్వరములోనే అశక్తి ఉన్నది.

దేవకి తన నష్ట సంతానం కొరకు విలపించిన విలాపం హృదయ విదారకముగా ఉన్నది. కృష్ణుడు జన్మించిన తరువాత తాను పొందిన అనంతానందమూ అనంత దుఃఖమూ, ఆ రెండింటికినీ గల సమరమూ దేవకి హృదయంగమంగా అభినయించినది. వసుదేవుడు తన కుమారుని రేపల్లె తీసుకొని పోతున్న విషాద దృశ్యంలో దేవకి తన యాతన నంతనూ ముఖములోనే చూపించినది. ఆమె దృష్టులే మాట్లాడుతున్నవా అనిపించినది. ముఖాభినయంలోనే ఆమె గ్రంధకర్త వ్రాసిన స్వగతభావాలను చూపించినది. తరువాత దృశ్యములో యోగమాయావిర్భావము కలిగినది. అపుడామె శోక, తాప, భయ, సంభ్రమాశ్చర్య భావాలనన్నింటినీ కూడ ప్రదర్శించినది. దేవకీ పాత్ర ఔన్నత్యము (climax) యీ దృశ్యములో సంపూర్ణంగా కనపడ్డది.

"దేవకీపాత్ర ఎట్లా ఉంది?" అని లక్ష్మయ్యగారడిగినారు.

"చాలా బాగున్నది. ఇంత చక్కగా యీపాత్రనభినయించినవారు నా కిదివరకు కన్పడలేద"ని బదులు పలికినాను.

"ఆమె ఎవరో ఎరుగుదురా?"

"తెలియదు. కాని ఆ ముఖాన్ని ఎక్కడనో చూచినట్టు జ్ఞాపకం" అన్నాను.

"ప్రథమ నాట్యకళా పరిషత్తు తెనాలిలో జరిగిందికాదూ? అపుడామెను మీరు చూశారు. నాటికామె నాల్గయిదేండ్ల బాలిక" అన్నాడాయన.

"ఆమె ఎవరు?"అని అడిగాను.

"శాంత! గోవిందరావుగారి కుమార్తె."

వనారస గోవిందరావుగారిని యావదాంధ్రలోకమూ ఆంధ్రనాటక రంగోద్ధారకుడని ప్రశంశించినది. అతని షష్టిపూర్త్యుత్సవమును మహా వైభవంగా జరిపినది, అతని శిలా విగ్రహమును ఏలూరులో ప్రతిష్ఠించినది-గోవిందరావుగారిని నేను చాలా కాలమునుంచి ఎరుగుదును. నాట్యకళకోసమనే అవతరించిన తెనుగువారిలో అతడు ముఖ్యుడు. స్వయముగా అతడు నటుడు. డెబ్బది సంవత్సరాలు నిండినా నేటికి అతడు పాత్రధారణ మానుకోలేదు. అతని భార్య శ్రీమతి లక్ష్మమ్మగారు ప్రసిద్ధనటి. ఇంక వారిరు

పురి సంతానమయిన కుమారి శాంత మహానటి కావడంలో నాకేమీ విచిత్రం తోచలేదు.

౪

గోవిందరాయ నాట్యమండలివారు తరువాత "కాంతామతి" అనే నాటకాన్ని ప్రదర్శించినారు. ఈ నాటకం మా తాత ముత్తాతలనాటిది. మా నాన్నగారు (శ్రీ విశ్వనాథ కవిరాజుగారు) తాను పుట్టి మొట్ట మొదట తన నాలుగోయేట చూచిన నాటకం కాంతామతి అని నాతో చెపుతూఉంటారు. నాటక రచన విషయం విమర్శించడం నా కిష్టంలేదుగాని అది ఆంధ్ర నాటకాలలో బహు పురాతనమైనది గదా అనే గౌరవమూ అభిమానమూ నాకు "కాంతామతి" మీద గలవు.

కాంతామతిలో గోవిందరావుగారు దొంగ పాత్రా, ఆయన సతీమణి శ్రీమతి లక్ష్మమ్మగారు కాంతామతి పాత్రా ధరించినారు. ఈపాత నాటకంలో నిర్వాహకులొక క్రొత్త దృశ్యమొకటి జొప్పించినారు. అది భిల్ల కన్యల నృత్యం.

శాంత భిల్లకన్యగా మారినది. పాత్రధారణ (make-up) అత్యద్భుతముగా నున్నది. వింతగా తలను జుట్టుముడి; పైని నెమిలికన్నులు, అడవి ఆకులూ, మెడలో పూసలపేరులూ, చెవులకూ ముక్కుకూ పెద్ద పెద్ద రింగులూ, చేతులకూ ఘల్లుఘల్లుమనే కడియాలూ ఆకుబట్టలూ ధరించినది. చెలికత్తెలతో గలసి కోయ పాటలు పాడుతూ నృత్య మారంభించినది. ఆమె వివిధ గతులలో వివిధ విధములలో ఒక అరగంట కాలం నృత్యం చేసినది. సామాజికులు ముగ్ధులయినారు. నేను బెంగాలులో తిరిగే రోజులలో ఒకసారి మాత్రం యేదో వంగ నాటకంలో యిటువంటి నృత్యమే చూచి నాను... శాంత... భిల్లకన్య నృత్యం చాలించి వెళ్లి పోయినది. ఇంకా నా కనుల ఎదుట భిల్లకన్య ఘల్లు ఘల్లుమని చేతి కడియాలు చప్పుడుచేస్తూ పాటపాడుతూ చక్రాకారంగా తిరుగుతూ నాట్యంచేస్తున్నట్టే ఉన్నది. ఆ నృత్యం ఆనర్తకి నా హృదయంలో ముద్రితమైనారు.

౫

తరువాత నేను చూచిన నాటకం "మహానంద". "మహానంద సాంఘిక నాటకము. ఇందులో స్వయం కృతాపరాధంకూడా కొంత ఉంది. కనక యీనాటకం చూచిన తరువాతగాని మీరు వెళ్ళడానికి వీలులేద"ని లక్ష్మయ్యగారు కోరగా, ఉండి నాటకం చూచినాను.

మహానందలో లక్ష్మయ్యగారు భైరవశాస్త్రి పాత్ర ధరించినారు. మదనకామరాజు పాత్ర గోవిందరావుగారి పుత్రులు శ్రీ సుబ్బారావుగారు నిర్వహించినారు. మహానంద పాత్ర శాంత గైకొన్నది.

మహానంద రాజపుత్రిక, గాని కారణాంతరాల వల్ల వేశ్యయింట నివశించుచున్నది. ఆమెకు తన జనన కథ తెలియదు. సహజంగా ఆమె హృదయం శివ భక్తిలో మగ్నమై ఉంటుంది. ఆమెను వేశ్య, వృత్తిలో ప్రవేశించమని బలవంత పరుస్తుంది. మహానంద అంగీకరించదు. తుదకు సోమనాథారాధ్యుడనే అతనిని వివాహం చేసుకుంటుంది. ఆమె జీవితం విషాదాంతమై పోతుంది. ఇదీ ఆ నాటకకథ.

శాంత ఆద్యంతమూ భక్తి భావమునే ప్రదర్శించినది. మొదట దైవభక్తిని తరువాత పతిభక్తిని కడు నైపుణ్యముగా అభినయించినది.

తెనుగు దేశములో భక్తి అంటే వింతవింత అభిప్రాయాలు ఉన్నవి. తరుచుగా రంగస్థలం మీదా తెరలమీదా నటించేభక్తి ప్రేక్షకుల హృదయాలలో నాస్తికతను కల్గించడానికి కారణ మవుతున్నదని చెప్ప వచ్చును. భగవంతుని గురించిన పాటలను కనులు మూసుకొని నమస్కరించుతూ ఏ తులసీమాతకో ఎదురుగా కూర్చుండి పాడినంత మాత్రాన భక్తిభావం

టిన హృదయంలోగాని ప్రేక్షకుల హృదయంలో గాని కలిగి తీరుతుందని చెప్పడానికి వీలులేదు. మొదట ప్రేమ హృదయంలో కలగవలెను; ఆ ప్రేమను వ్యక్తపరచడానికై మాటలు రావలెను. నేను బెంగాలులో భక్తురాండ్రయిన అనేకమంది సోదరీమణుల నెరుంగుదును. మహాప్రభువు కోసమని వారు పొందే పరితాపకు భక్తి అని తెలుసుకొన్నాను.

శాంత భగవంతుని గురించి పాటలు పాడలేదు; ఉపన్యాసాలు యివ్వలేదు; వేదాంతం బోధపరచలేదు. కాని ఆమె చూపు ఆమె పలుకు, ఆమె కదలిక, ఆమె నడక-భక్తి భావమునే ప్రదర్శించినవి. ఒకచోట వేశ్యమాత తన్ను వృత్తిలో ప్రవేశించమని బలవంత పరుస్తున్నపుడు ఆమె బిగ్గరగా ఏడ్చినది. ఆమె కనుల వెంబడి కన్నీరు జలజల ఆమె కపోలములపై ప్రవహింప సాగినది. ఆమె కంఠము గద్గదిక వహించినది.

మహానంద మహాగ్నిజ్వాలల్లో పడిపోయే దృశ్యంలో ఆమె నటన అద్భుతం. మహానంద చూచిన తరువాత యీమె సహజంగా కవయిత్రికాబోలు నను కొన్నాను.

౬

శాంత వయస్సు పదిహేను సంవత్సరాలు. కాని ప్రతిభ అపారమయినది. ఆమె తాము ప్రదర్శింపబోయే నాటకాన్ని తొలుత శ్రద్ధగా పఠించుతుంది. తరువాత తానభినయింప బోయే పాత్రను 'స్టడీ' చేస్తుంది. ఆమెకు గల భాషాజ్ఞానం నటనకు చాలా తోడ్పడుతూ వున్నది.

ఆంధ్ర నాటక రంగస్థలం కోసమనే జన్మించిన తార శాంత. శాంతను కొందరు "అభినయ సరస్వతి" అన్నారు. "నేను "నటీమణి" అంటాను.

౭

ఏలూరులో మెయిలు ఎక్కుతూ "నిజంగా నాకు మీరు నటీమణినే చూపించినారు" అని లక్ష్మయ్యగారితో అన్నాను.

"కళావేత్తలకు కళను చూపించటమే మాపని" అని క్రొత్తపల్లి లక్ష్మయ్యగారు నవ్వినారు.

రైలు కదలినది. చలిగాలి కొడుతున్నది. శాలువ కప్పుకొని "బంగశ్రీ" పత్రిక తెరిచినాను, బెంగాలీ పత్రిక కాగితాల్లో దేవకి రోదిస్తున్నది భిల్లకన్య నృత్యం చేస్తున్నది మహానంద భక్తిలో తన్మయురాలవుతున్నది.

